శరవేగంగా పూడికతీత

- ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో 9.71 కిలో మీటర్ల నాలాలు
- ఇప్పటి వరకు పూడికతీత పనులు చేసింది 9.10 కిలో మీటర్లు


నాలాలో పూడికతీత పనులు చేపడుతున్న సిబ్బంది

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ సర్కిల్–3 పరిధిలో నాలాల పూడిక తీత పనులు శరవేంగగా జరుగుతున్నాయి. సర్కిల్ పరిధిలోని నాగోలు, మన్సూరాబాద్, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలో ఉన్న నాలాల పనులు వర్షాకాలం రాక ముందే చకచక జరుగుతున్నాయి. సర్కిల్ పరిధిలో సుమారుగా 9.71 కిలో మీటర్ల పొడవున నాలాలు ఉన్నాయని వర్షం వస్తే నాలాలు నిండి కాలనీలోకి వరద నీరు రావడంతో కాలనీలు ముంపునకు గురవతుండేవి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని నాలాల పూడిక తీత పనులు వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని అధికార యంత్రాంగం దృష్టి సారించి పనులను వేగంగా పూర్తి చేసే దిశలో ఉన్నారు.

పనులు జరుగుతున్న నాలాలు..

ఎల్‌బీనగర్ సర్కిల్–3 పరిధిలోని నాగోలు డివిజన్‌లో ఆదర్శనగర్‌కాలనీ, మన్సూరాబాద్ డివిజన్‌లోని సహార ఎస్టేట్స్, హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారాకాలనీ, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గౌతంనగర్ నాలాల పనులు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించండంతో పనులలో జాప్యం లేకుండా చకచక జరుగుతున్నాయి. సర్కిల్ పరిధిలోని నాలాల పూడికతీత పనుల దాదాపు పూర్తి కావస్తున్నాయి. మొత్తం సర్కిల్ పరిధిలో 9.71 కిలోమీటర్ల పొడవున నాలాలు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు సుమారుగా 9.10 కిలో మీటర్ల వరకు పూడికతీత పనులను పూర్తి చేశారు. మరో 0.61 కిలో మీటర్ల వరకు నాలా పూడికతీత పనులు జరుగుతున్నాయని ఈ నెలఖారు వరకు పూడిక తీత పనులు పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో వరద నీరు కాలనీల్లో రాకుండా ముందస్తు చర్యలో భాగంగా నాలాల పూడిక తీత పనులను చేపట్టినట్లు ఈఈ రమేష్‌బాబు పేర్కొన్నారు. దాదాపు పనులు పూర్తి కావస్తున్నాయి. పూడికతీత పనులను డీఈ, ఏఈలతో కలిసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనుల పురోగతిని సమీక్షిస్తున్నామని ముంపు సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.


పనులను పరిశీలిస్తున్న జోనల్ ఎస్ఈ అశోక్‌రెడ్డి

శారదానగర్ కాలనీ అభివృద్ధికి చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: శారదానగర్ కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదా నగర్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల కోరిక మేరకు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తును జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దాదాపు రూ. 80 లక్షల వ్యయంతో హాల్ నిర్మాణం జరుగుతోందన్నారు. కొన్ని పనులు మిగిలి ఉన్నాయని, త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వరదనీరు నిలుస్తోందని ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, మల్లీశ్వరి, భాస్కర్‌సాగర్, శ్రావణ్, కేఎల్ఎన్.రావు, జగన్‌మోహన్, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్, మధు, లక్ష్మణ్, ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

తొలిబోనం వేడుకను జయప్రదం చేయాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అనిల్ కుమార్

చంపాపేట: ఈ నెల 26న గోల్కొండ జగదాంబ అమ్మవారికి సమర్పించే కుమ్మర్ల తొలి బోనం వేడుకకు రాష్ట్రంలోని కుమ్మర్లందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు సిల్వేరి అనిల్‌కుమార్ కోరారు. మంగళవారం చంపాపేటలోని కుమ్మర్ల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై వేడుకకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ..తెలంగాణ కుమ్మర్ల సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, వృత్తినైపుణ్యాలు బోనాల పర్వదిన వేడుకలో ప్రతిబింబిస్తాయని అన్నారు. వేడుకకు హాజరయ్యే మహిళలు, శివసత్తులు, పోతరాజుల విన్యాసాల నడుమ అలంకరించిన మట్టి కుండలో వేపాకు, పసుపు, గుగ్గిలం, నైవేద్యాలతో హాజరై అమ్మవారికి సమర్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శంకర్, సభ్యులు అనాల్, ప్రేమ్‌కుమార్, కృష్ణ, కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'గత ప్రభుత్వం జీహెచ్ఎంసీ నిధులను కాళేశ్వరానికి మళ్లించింది'


మాట్లాడుతున్న మధుయాష్కిగౌడ్

ఎల్‌బీనగర్: జీహెచ్ఎంసీ నిధులను గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించి హైదరాబాద్ నగర అభివృద్ధిని విస్మరించిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ విమర్శించారు. మన్సూరాబద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని బాలాజీనగర్ పార్కు, డీర్ పార్కును మంగళవారం ఆయన సందర్శించి వాకర్స్‌తో సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే జీహెచ్ఎంసీ నిధులు శివారు ప్రాంతాల్లో ఖర్చుపెడుతూ మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఆటోనగర్‌లోని మహావీర్ హరిణి వనస్థలి జాతీయ పార్కులో కొత్తగా రెండు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయిస్తానని తెలిపారు.10 కాలనీలకు ఉపయోగపడే డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులను తొందరగా పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమిడి రామకృష్ణారెడ్డి, రామారావు, క్లెం నర్సింహ్మారెడ్డి, సుధాకర్‌గౌడ్, వేణుగోపాల్‌యాదవ్, రామేష్‌నాయక్, మహేందర్‌యాదవ్, శ్రీనివాస్, నర్సింహాయాదవ్ పాల్గొన్నారు.

ధ్యానాంజనేయ స్వామికి మంత్రి పూజలు


మంత్రి దంపతులతో ఆలయ ఈఓ లావణ్య

చంపాపేట: మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి దంపతులు మంగళవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ ఈఓ లావణ్య ఆధ్వర్యంలో శ్రీహరి దంపతులను వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పూర్ణకుంభంతో ఆలయంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అలయ అర్చకులు వారిని వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలను అందించి శేషవస్త్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్‌శర్మ, అంబా ప్రసాద్, ప్రవీణ్‌శర్మ, సిబ్బంది వెంకటయ్య పాల్గొన్నారు.

వైకల్య శాతం ఎక్కువగా ఉన్నవారికి ప్రాధాన్యం

చాదర్‌ఘాట్: దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో వైకల్యశాతం ఎక్కువగా ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారని వికలాంగుల సంక్షేమశాఖ కార్యలయం అధికారులు తెలిపారు. డిగ్రీ ఆపైన చదువుకొన్న వారికి వైకల్య ప్రాధాన్యతగా మూడు చక్రాల స్కూటర్ ఇస్తారని తెలిపారు. డిగ్రీ చదువుకొంటున్న వాళ్లకు టెక్నికల్ కోర్స్ వారికి ల్యాప్‌టాప్‌లు, ఇంటర్ చదువుతున్న దృష్టి లోపం ఉన్న వారికి ట్యాప్స్ అందజేస్తారన్నారు. పదవ తరగతి చదువుతున్న దృష్టి, వినికిడి లోపం ఉన్నవారికి 5జీ స్మార్ట్ ఫోన్స్ ఇస్తారని లెప్రసీ వైకల్యం గల వారికి ఎంఎల్‌సీ (మైక్రో సెల్యులార్ రబ్బర్) చెప్పులు, కండరాల క్షీణత వైకల్యం గల వారికి బ్యాటరీ వీల్‌చైర్స్ అందజేస్తారన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 18 లోపు ఓబీఎంఎంఎస్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

70 ఏళ్లలో కాని అభివృద్ధి 11 ఏళ్లలో చేశాం


మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

చంచల్‌గూడ: దేశంలో 70 సంవత్సరాల్లో లేని అభివృద్ధిని ప్రధాని నరేంద్ర మోదీ కేవలం 11 సంవత్సరాల్లో చూపించారని బీజేపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన పాతబస్తీలో పర్యటించి కుర్మగూడలోని భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రజల సహకారంతో మోదీ మరిన్ని అద్భుతాలు సృష్టిస్తారన్నారు. వేల రూపాయల్లో ఉన్న వ్యవసాయ బడ్జెట్‌ను రూ.1.33 లక్షల కోట్లకు తీసుకొచ్చి రైతులను భరోసా కల్పిస్తున్నారన్నారు. అమృత్ భారత్ పథకం కింద 1300 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేశారన్నారు. కొత్తగా 15 ఎయిమ్స్ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. నిరంజన్‌యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ పార్టీ మరింత బలపడుతుందన్నారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అభివృద్ధే లక్ష్యంగా మేయర్ పీఠం గెలుస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, నాయకులు ధర్మతేజ, కామాటీ మహేష్, నవీన్‌యాదవ్, యశ్వంత్, నాగరాజు, అరవింద్, ప్రమోద్, పెద్ద, ఈశ్వర్ తదితరులున్నారు.

నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న ఓంప్రకాశ్

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారం భరద్వాజ కాంప్లెక్స్ మ్యాక్ సొసైటీ హైదరాబాద్ పరిధిలో జరిగిన ఎన్నికల్లో తొమ్మిది మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోఆపరేటివ్ సొసైటీ రిటైర్డ్ రిజిస్ట్రార్ ఓంప్రకాశ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా గిరిధర్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, కోశాధికారిగా హన్మంతరావు, మెంబర్లుగా అంబప్రసాద్, నవీన, చంద్రమౌళి, జ్యోతి, అబిదాబేగం, ఎస్.సంతోష్ ఎన్నికయ్యారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

ఎల్‌బీనగర్: మన్సూరాబాద్ డివిజన్ ఆదిత్యానగర్‌కాలనీలోని శ్రీలక్ష్మి పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం 7.30 గంటలకు ప్రాబోధకి, 8 గంటలకు నిత్యహోమం, ధ్వజప్రతిష్ఠాదులు, పూర్ణాహుతి, 11.30లకు ధ్వజారోహణం కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం ఉదయం 11గంటలకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు.

రేమాండ్స్ సమాధుల వద్ద పరిశుభ్రత కల్పించండి


వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: ఆస్మాన్‌గఢ్‌లోని చారిత్రక రేమాండ్స్ సమాధుల వద్ద తగిన పర్యవేక్షణ కల్పించి పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్ విభాగం డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. రేమాండ్స్ సమాధుల ప్రాంగణం మొత్తం చెట్లు, చెదారంతో నిండిపోయి విషసర్పాలు, క్రిమికీటకాల బెడద పెరిగిందన్నారు. చుట్టూ నివాస సముదాయాలు హద్దులుగా ఉన్న చారిత్రక రేమాండ్స్ సమాధుల ప్రాంగణం మొత్తం చిన్నపాటి అడవిని తలపించేలా పెరిగిన పిచ్చి మొక్కలతో పరిసర కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్కియాలజీ విభాగం అధికారులు స్పందించి రేమాండ్స్ సమాధుల ప్రాంగణంలో పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

మోడల్ శ్మశానవాటికగా అభివృద్ధి చేస్తా


శ్మశానవాటికను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధి జడ్జెస్‌కాలనీ ఫేజ్–1లోని హిందూ శ్మశానవాటికను మోడల్ శ్మశానవాటికగా అభివృద్ధి చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. కాలనీవాసులతో కలిసి హిందూ శ్మశానవాటికను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.54.4లక్షల నిధులు మంజూరయ్యాయని, సీసీ రోడ్డు, గార్డెన్, గ్రానేట్‌తో నిర్మాణం, పెయింటింగ్, ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేయిస్తానన్నారు. కాటికాపరులు దహన సంస్కారాలకు అడ్డగోలుగా వసూలు చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, భిక్షపతి, శ్రీశైలంయాదవ్, రాములు, బద్రీనాథ్, షణ్ముకచారి, వెంకటేశ్వర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..
టమాటా రూ.27, వంకాయ రూ.23, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.42, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.28, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.40, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.21, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.25, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.35, మునగ రూ.45, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.23, కీర రూ.35, బీన్స్ రూ.75, క్యాప్సికమ్ రూ.70.

వేధించారు.. జైలుకు వెళ్లారు


కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న షీ టీమ్స్ పోలీసులు

పోకిరీలకు కౌన్సెలింగ్

నాగోలు: బాలికలు, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని రాచకొండ పోలీస్ కమిషనర్ సు.దీర్‌బాబు సూచించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో గత నెల రోజుల్లో 240 మంది పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ సభ్యులు పట్టుకుని మంగళవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ క్యాంప్ కార్యాలయంలో కటుంబ సభ్యులతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళలు, యువతులను వేధింపులకు గురిచేస్తున్న 240 మందిలో (మేజర్లు–160, మైనర్లు–80) మందిని షీ టీమ్స్ పట్టుకున్నారు.

షీ టీమ్‌కు వచ్చిన ఫిర్యాదులు..

మైనర్‌ను వేధించిన సీనియర్ సిటిజన్ అరెస్టు

మూడేళ్లుగా మైనర్ బాలిక కుటుంబ సభ్యులు నిందితుడి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఇంటి యజమాని నిందితుడు (73) ఎవరూ లేనప్పుడు మైనర్ బాలిక వద్దకు వచ్చి శారీరక వేధింపులకు గురి చేసేవాడు. అందరూ ఉన్నప్పుడు స్నేహంగా ప్రవర్తించేవాడు. దీంతో అతనిపై ఎవరికి అనుమానం వచ్చేదికాదు. అతడి వేధింపుల గురించి బాలిక కుటుంబ సభ్యులకు చెప్పినా తడు అలాంటి వాడు కాదని మందలించారు. దీంతో ఏం చేయాలో ఎవరికి చెప్పాలో బాలికకు అర్థం కాలేదు. నిందితుడు అలవాటు ప్రకారంగా ఒక రోజు బాలిక దగ్గరికి వచ్చి లైంగికంగా వేధిస్తుంటే అతనికి తెలియకుండా ముందుగానే మొబైల్ ఫోన్ రికార్డు ఆన్‌చేసి పెట్టింది. ఆ దృశ్యాలను కుటుంబ సభ్యులకు చూయించింది. షీ టీం సంప్రదించగా క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితుడిని జైలుకు పంపించారు.

ఓయో రూమ్‌కి రావాలని..

ఓ యువతి క్రికెట్ కోచింగ్ తీసుకుంటుంది. అదే చోట ఓ వ్యక్తి తరచుగా ఆమెతో మాట్లాడేవాడు. నిందితుడు యువతితో స్నేహంగా మాట్లాడుతూ తనని ప్రేమిస్తున్నానని చెప్పడంతో యువతి తిరస్కరించింది. దీంతో నిందితుడు యువతిని ప్రేమించకపోయిన పరవాలేదు, ఓయో రూమ్ కి రా.. లేకపోతే క్రికెట్ ఆడుతున్న సమయంలో దిగిన ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతానని బెదిరించడంతో సదరు యువతి షీ టీం సంప్రదించగా నిందితుడిని అరెస్టు చేశారు.

ఆన్‌లైన్ గేమింగ్ యాప్ ద్వారా వేధింపులు..

బాలికకు ఆన్‌లైన్ గేమింగ్ అప్లికేషన్ (లూడో) ద్వారా పరిచయమైన నిందితుడు ఇన్‌స్టాగామ్ ఖాతా ద్వారా మెసేజ్ చేసేవాడు. కొన్ని నెలల తర్వాత ఆమె అతని ప్రవర్తన కారణంగా అతనితో మాట్లాడడం మానేసింది. నిందితుడు తన వద్ద వీడియోలు, చిత్రాలు ఉన్నాయని ఆమెను బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. ఈ విషయంపై షీ టీం వారిని సంప్రదించగా క్రిమినల్ కేసు నమోదు చేసి జైలుకు పంపారు.

బాల్య వివాహాల నిలుపుదల

ఇబ్రహీంపట్నం, నారాయణపూర్ ఏరియాలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో షీ టీంలు వెంటనే స్పందించి(డీసీపీయు) జిల్లా బాల–బాలికల సంరక్షణ విభాగం) అధికారులతో సంఘటన స్థలానికి చేరుకొని బాల్య వివాహాలను అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషా రాణి, సీఐ ముని, జె.హనుమంతు, జి. అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ రాజు షీ టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు.. పద్మావతి కాలేజీ, ఇంద్రప్రస్థ ఫేజ్–2, సుబ్రహ్మణ్య నగర్, కరణ్‌బాగ్ పరిసర ప్రాంతాలు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు సైదాబాద్ 2ఆర్‌టీ మెయిన్‌రోడ్, వెంగళ్‌రావ్ పీటీ, సైదాబాద్ రామాలయం, ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, లక్ష్మీనగర్ సాయిబాబా టెంపుల్ పరిసర ప్రాంతాలు.

చంపాపేట పరిధిలో..

చంపాపేట: మారుతీనగర్, పోచమ్మగడ్డ 33/11 విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మారుతీనగర్, పోచమ్మగడ్డ, యాదగిరినగర్, దుర్గాభవానీ నగర్, ముస్లీంబస్తీ, శివారెడ్డి అపార్ట్‌మెంట్ ప్రాంతాలు. వినయ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు వినయ్‌నగర్, కృష్ణానగర్, ఎస్ఎస్ఆర్, బీఎస్ఎన్ఎల్, శ్రీనివాసనగర్, బాలాజీనగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న గజానందం

మలక్‌పేట: జీహెచ్ఎంసీ మలక్‌పేట డిప్యూటీ సిటీప్లానర్ గజానందం సర్కిల్–6 పరిధిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, తిరుమలేష్, రవీందర్ పాల్గొన్నారు.

నియామకం


పృథ్వీ చౌదరీ

ఎల్‌బీనగర్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా మన్సూరాబాద్ డివిజన్ సహారాస్టేట్స్‌కాలనీకి చెందిన వేముల పృథ్వీ చౌదరీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పృథ్వీ మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తగా పార్టీ ఆదేశానుసారం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ వచ్చానని, పార్టీ పెద్దలు గుర్తించి ప్రధాన కార్యదర్శి పదవిని ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

ఎల్‌బీనగర్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి దేవాలయ 20వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు పంచామృత ఫలరస అష్టోత్తర కలశాములతో అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సాముహిక కుంకుమార్చన, అనంతరం అమ్మవారి శేషవస్త్రాల వేలం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.

అభివృద్ధే లక్ష్యం


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలల్లోని సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తానని డివిజన్ అభివృద్ధే ప్రధాన లక్ష్యమని స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ, క్రాంతినగర్ కాలనీలలో రూ 1.20 కోట్ల నిధులతో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, ఆనంద్, దివాకర్, సత్యనారాయణ, నాయకులు కృష్ణగౌడ్, శ్రవణ్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యం


శిల్ప, నిరీక్షణ

నాగోలు: కూతురితో పాటు తల్లి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శివనాగ ప్రసాద్ వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండల పరిధిలోని నాదర్గుల్ సాయినగర్‌కు చెందిన కోతి శిల్ప (31) తన కూతురైన నిరీక్షణ(11) గౌరెల్లి ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ వద్ద నివాసముంటున్న ఆమె అక్క వద్దకు వచ్చి తిరికి ఇంటికి రాకపోవడంతో భర్త బాబ్జి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.